
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


చౌడేపల్లె క్రాస్ సమీపంలో మోరీవద్ద కాలువలేక నిల్వ ఉన్న నీరు

చెరువులకు వెళ్లే కాలువలపై నిర్మించిన మోరీల్లో నీళ్లు వెళ్లకుండా మూసేస్తున్నారు. ఈ నీళ్లు చెరువులకు చేరితే మట్టి తవ్వుకొనే అవకాశం ఉండదని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. కొందరు ఆక్రమణదారులూ మోరీలకు గోరీ కడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.


తీగలమ్మచెరువులో మోరీలో నీళ్లు వెళ్లకుండా మట్టివేసి అడ్డుపెట్టిన మట్టిమాఫియా

మోరీలకు గోరీ..!

● పుంగనూరు బైపాస్‌రోడ్డులో మూసేసిన అక్రమార్కులు

పుంగనూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందిపడుతుండగా కేంద్రప్రభుత్వం భీమగానిపల్లె నుంచి అరబ్బిక్ కాలేజీ వరకు బైపాస్ రోడ్డు నిర్మించింది. రోడ్డు మార్గంలో పలుచోట్ల గతంలో చెరువులు, వంకలు, కుంటలకు వర్షపు నీళ్లు వెళ్లేందుకు కాలువలు ఉన్నాయి. బైపాస్ రోడ్డు వేయడంతో ఈ కాలువల్లో నీళ్లు సాఫీగా వెళ్లేలా కల్వర్టులు నిర్మించి మోరీలు కట్టారు. అందులో పలు చోట్ల పేరుకు మాత్రమే మోరీలున్నా నీరు వెళ్లే అవకాశాలు లేవు. కల్వర్టుల వరకే కాలువలు ఉండగా ఆక్రమణదారులు మోరీల నుంచి నీరు వెళ్లకుండా పూడ్చివేశారు. వాటిని రిపేర్లు చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. తీగలమ్మ చెరువు మధ్యలో జాతీయరహదారి వెళుతుండగా కల్వర్టు నిర్మించారు. దీన్నుంచి చెరువుకు నీరు వెళ్లే పరిస్థితి లేకుండా మట్టిమాఫియా మోరీలను మూసివేసింది. ఒకవైపు భారీ ఎత్తున మట్టితవ్వకాలు సాగుతుండగా వర్షం నీరు మోరీల ద్వారా వస్తే మట్టి తరలింపు వీలుకాదని ఇలా మోరీలను పూడ్చేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లకోసం ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నారు. వీరి స్వార్థం కోసం బైపాస్ రోడ్డులో చాలా చోట్ల మోరీలు పూడ్చేశారు. దీనివల్ల చెరువులకు నీళ్లు చేరడంలేదు. ఇప్పటికైనా పుంగనూరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాల కోసం మోరీలను మూసివేయడం.. కొందరు ఆక్రమించిన ఘటనలపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిఉంది.

\- పుంగనూరు

రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ నౌవ్‌లాక్ తోట సమీపంలో కల్వర్టుకు మోరీ కట్టకుండా కమ్మీలను అలాగే వదిలేశారు. మోరీ గోడలు లేక ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు అసంపూర్తి పని చేయించడంలో ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శించారో తెలియడంలేదు.



బైపాస్‌రోడ్డు నౌవ్‌లాక్ తోట సమీపంలో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు మోరీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇది ప్రభుత్వ స్థలం


రోడ్డు పొరంబోకు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

● ఎవరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు

గంగవరం, మార్చి 12: 'నీకెంత.. నాకెంత' అంటూ రోడ్డు పొరంబోకు స్థలాన్ని వాటాలేసుకుని, పట్టాలు పొందడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కొందరు రెవెన్యూ అధికారులు కలిసి సాగించిన ఈ వ్యవహారాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనంపై స్పందించిన రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణం ఆక్రమిత స్థలంతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లు ఎవరెవరికి మంజూరు చేశారో పూర్తి వివరాలు తెలపాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో అధికారులు 'ఇది ప్రభుత్వ భూమి. ఇందులో ఎవరూ ప్రవేశించరాదు' అంటూ రోడ్డు పొరంబోకు స్థలంలో హెచ్చరిక బోర్డు నాటారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మరోవైపు రోడ్డు పొరంబోకుగా ఉన్న 319 సర్వేనెంబరుకు సంబంధించి రికార్డులు, ఈ స్థలాన్ని ఎవరెవరికి కేటాయించారనే వివరాలతో రావాలని జిల్లా రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు పూర్తి రికార్డులతో స్థానిక రెవెన్యూ అధికారులు చిత్తూరుకు పయనమయ్యారు.

పేలుళ్లతో దద్దరిల్లిన కోటబండ

● ముందస్తు హెచ్చరికలు లేకుండా డిటొనేటర్లు పేల్చిన నిర్వాహకులు

● పొలాల్లో పడిన రాళ్లు


రాళ్లు పడటంతో విరిగిన మామిడి చెట్టు

వి.కోట, మార్చి 12: వి.కోట మండలం తోటకనుమ పంచాయతీలో అనధికార క్వారీతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ముందస్తు హెచ్చరికలు లేకుండా క్వారీ నిర్వాహకులు డిటొనేటర్లను పేల్చారు. ఒక్కసారిగా పెద్ద పెద్ద బండరాళ్లు సమీప పొలాలపై పడ్డాయి. అదే సమయంలో పొలం పనుల్లో ఉన్న కూలీలు భయాందోళనతో పరుగు తీశారు. కోటబండకు చెందిన గంగప్ప పశువుల పాక సమీపంలో రాళ్లు పడ్డాయి. నాగరాజు, వరదరాజులు, మణి, వెంకటప్ప, చిన్నప్పయ్య అనే రైతులకు చెందిన బీన్స్ టమోటా, మామిడి, చిక్కుడు తోటల్లోనూ చిన్న చిన్న బండరాళ్లు పడ్డాయి. ఈ రాళ్ల దెబ్బకు మామిడి చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీనిపై క్వారీ నిర్వాహకులను ప్రశ్నిస్తే వచ్చే నాలుగు నెలలు ఇటువైపు రావద్దని తమను బెదిరిస్తున్నారని రైతులు వాపోయారు. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో భాగంగా అనధికారికంగా క్వారీ నిర్వహిస్తూ తమను ఆందోళనకు గురిచేస్తున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి అనధికారిక క్వారీపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


బీన్స్‌తోటపై పడ్డ బండరాళ్లు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వండి

● రైల్వే అధికారులకు చంద్రబాబు లేఖ

కుప్పం, మార్చి 12: కుప్పం రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని టీడీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు సౌత్ వెస్టన్ రైల్వే బెంగళూరు డివిజన్ మేనేజర్‌కు లేఖ రాశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్యలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కీలకమైన పట్టణం కుప్పమని ఆ లేఖలో పేర్కొన్నారు. కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయం, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అనేక విద్యాలయాలు ఉన్నాయన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక విద్యార్థులు పలువురు ఈ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. వివిధ సంప్రదాయ, అధునాతన వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంగా కూడా కుప్పం విలసిల్లుతోందని, నిత్యం ప్రయాణాలు చేసే జనాభా కలిగి ఉన్నదని తెలిపారు. ఇందువల్ల బెంగళూరు-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-ఎర్నాకులం, బెంగళూరు హుబ్బళ్లి-చెన్నై ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్-లక్నో ఎక్స్‌ప్రెస్, ఎల్ఎంవీటీ బెంగళూరు-కొచ్చువెల్లి ఎక్స్‌ప్రెస్, యశంతపూర్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వాలని చంద్రబాబు కోరారు. అధినేత రాసిన లేఖను టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం రైల్వే అధికారులకు అందించారు.


రైల్వే అధికారులకు లేఖను అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



గ్రూప్ థియేటర్స్ - తిరుపతి	శ్రీనివాస - పెనుకొండ
అజంతా - పీలేరు	చాంద్ థియేటర్ - ప్రొద్దుటూర్
అప్సరా - కడప	శ్రీనివాస - హిందూపూర్
వెంకటేశ్ కాంప్లెక్స్ - కర్నూల్	శ్రీనివాస - ఎమ్మిగనూరు
శ్రీరామ - కర్నూల్	సత్యం కాంప్లెక్స్ - ఆదోని
శ్రీరామ - నంద్యాల	? - మార్కాపురం
వాసవి - గుంతకల్	వేముల - కదిరి
సుధ - అనంతపురం	రాఘవేంద్ర - డోన్
వరలక్ష్మి - ధర్మవరం	వెంకటేశ్వర - బి కొత్తకోట
SLN థియేటర్స్ - తాడిపత్రి	శ్రీరామ - నందికొట్కూర్

PRAGATHI FILMS 9573783799

వేగంగా వెళ్లి.. చెట్టును ఢీకొని..!

● పోలీసులను తప్పించుకునే క్రమంలో 'ఎర్ర' కారుకు ప్రమాదం

● ముగ్గురు పట్టుబడగా.. మరో ముగ్గురు పరారీ

కల్లూరు, మార్చి 12: పోలీసులకు చిక్కకుండా వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఎర్రచందనం కారు చెట్టును ఢీకొంది. ఈ ఘటనతో ముగ్గురు ఎర్ర కూలీలు పట్టుబడగా మరో ముగ్గురు పరారయ్యారు. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పులిచెర్ల మండలం చెరువు ముందరపల్లి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళంపేట వైపు నుంచి పులిచెర్ల వైపు వస్తున్న కారులోని వారు ఈ తనిఖీలను గమనించారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో వేగంగా వెళుతూ చెట్టును ఢీకొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు డ్రైవర్ సహా ముగ్గురు పారిపోయారు. మిగిలిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన రామన్ కొలంద్రై (47), సేలం జిల్లాకు చెందిన పెరుమాళ్ (41), మురుగన్ (36)గా తెలిసింది. ఈ ప్రమాదంలో మురుగన్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరిని రిమాండుకు తరలిస్తున్నారు. వీరి నుంచి రెండు దుంగలు, ఐదు గొడ్డళ్లు, రంపం, వేయింగ్ మిషన్, కత్తులను స్వాధీనం చేసుకున్నారు.


ఇద్దరు ఎర్ర కూలీలను మీడియాకు చూపుతున్న పోలీసులు

పంటలపై గజదాడులు

కల్లూరు, మార్చి 12: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ కూనపల్లి సమీపంలో మంగళవారం వేకువజామున పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేశాయి. దీంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పాకాల మండలం రమణయ్యగారిపల్లి సమీపానికి సోమవారం రాత్రి ఏనుగుల గుంపు చేరుకున్నాయనే సమాచారంతో ఆ గ్రామానికి సరిహద్దులోని కూనపల్లి ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. ఏ సమయంలోనైనా ఏనుగుల గుంపు పొలాలపై పడి పంటలను ధ్వంసం చేస్తాయని ఆందోళన చెందారు. అందుకని అర్ధరాత్రి వరకు పొలాల వద్ద టపాకాయలు పేల్చారు. అయితే మంగళవారం వేకువజామున గ్రామానికి చెందిన రైతు గోవిందస్వామి వరిపంట, పశుగ్రాసంను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఆ గుంపులో సుమారు 10 ఏనుగులు ఉన్నాయని, గ్రామానికి సమీపంలోని మల్లేశ్వరస్వామి కొండవద్ద ఇవి మాటువేసినట్లు గ్రామస్థులు తెలిపారు.



SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ పేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మన్పోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 21.03.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.42-107-7 & 8 ,1వ అంతస్తు ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్, ఎన్.జి.ఓ కాలనీ, జయనగర్ కాలనీ కడప-516002

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
BNGRPPJ2309150002	R S PADHMANABHAM	PUNGAPJ2309050001	M SAHADEVAREDDY
BNGRPPJ2309150003	C S JAGADEESHWARAN	PUNGAPJ2309050005	T REDDAPPA
BNGRPPJ2309150004	R S PADHMANABHAM	PUNGAPJ2309040001	MANJUNATHA
BNGRPPJ2309140003	L RAMESH	VKOTAPJ2309040003	M SATHISH KUMAR
BNGRPPJ2309140005	L RAMESH	PLMNRPJ2308290001	VIJAY KUMAR
BNGRPPJ2309140006	L RAMESH	CHGIRPJ2308280001	DUPATI HIMA VAMSI
NGRI1PJ2309140009	TEJA A	PUNGAPJ2308280004	PATAN ATHAULLA KHAN
BNGRPPJ2309130002	R S PADHMANABHAM	PAKALPJ2308240001	A REDDEPPA CHOWDARY
BNGRPPJ2309130004	R S PADHMANABHAM	PUNGAPJ2308240002	VENKATARAMANA K
VKOTAPJ2309130013	GC ASHOK KUMAR	BNGRPPJ2308210002	BABY
CHTORPJ2309110002	K M ASEERVADHAM	NGRI1PJ2308210005	MAHESH BABU K
PLMNRPJ2309110004	K NAVEEN KUMAR REDDY	NGRI1PJ2308180004	BHUPALNAIDU M
CHTORPJ2309080002	T THANGARAJA	PAKALPJ2308160001	A REDDEPPA CHOWDARY
PLMNRPJ2309050001	G SUDHAKAR REDDY	PLMNRPJ2308160003	ANNAPURNA E

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం: 11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ ఎస్. శ్రీనివాసులును సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 12.03.2024
స్థలం : తిరుపతి

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నేటి నుంచి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి శనివారం వరకు జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు వేర్వేరుగా శిక్షణ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరిగే శిక్షణా కార్యక్రమానికి సాంఘికసంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ బి. శ్రీదేవి, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య పర్యవేక్షిస్తారన్నారు. పీవీకేఎన్‌లో జరిగే శిక్షణా తరగతులకు డ్వామా ఏపీవో గంగాభవాని, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బాని బాషా, డ్వామా ఫైనాన్స్ మేనేజర్ చిన్నరెడ్డప్ప, వాటర్ షెడ్ ఏపీడీలు ఉమావాణి పర్యవేక్షిస్తారన్నారు. ఎంపిక చేసిన 10 మంది మాస్టర్ ట్రైనర్లు శిక్షణలో అధికారులకు ఎన్నికల నిర్వహణ అంశాలపై విడివిడిగా శిక్షణ ఇస్తారని వివరించారు.

ఇంటర్ పరీక్షలకు 1193 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షలకు 1193 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 18,225 మంది విద్యార్థులకు గాను 17,032 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

రంజాన్ ఉపవాస వేళలు

ఇఫ్తార్ : బుధవారం
సాయంత్రం 6-28 గంటలకు

సహరి : గురువారం
ఉదయం 5-00 గంటలకు



ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి



తిరుపతి క్రైం, మార్చి 12: తిరుపతి ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి ఎస్పీ, ఏసీబీ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గతంలో ఈస్ట్ సీఐగా, తిరుమల, తిరుపతి ఎస్పీ డీఎస్పీగా, మదనపల్లె డీఎస్పీగా కూడా పనిచేశారు. అక్కడినుంచి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తిరుపతిలో ఉన్న ఏసీబీ కార్యాలయానికి డీఎస్పీగా బదిలీపై వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు చోట్ల పనిచేసిన అనుభవం ఉందన్నారు. శ్రీవారి పాదాల చెంత పనిచేయడం అదృష్టంగా భావిస్తానని చెప్పారు.






వేదికపై సంఘీభావం చాటుతున్న నాయకులు - సభకు హాజరైన జనం

మహానగరాలకు దీటుగా చిత్తూరు

● అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్న టీడీపీ అభ్యర్థి గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 12: చిత్తూరును మహానగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు తనవద్ద ప్రత్యేక మ్యానిఫెస్టో ఉందన్నారు. చిత్తూరులోని పీవీకేఎస్ కళాశాల మైదానంలో మంగళవారం రాత్రి 12 నుంచి 26 డివిజన్ల ప్రజలతో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి వసతి, రోడ్లు, డ్రైనేజి, వీధిదీపాలు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తానని చెప్పారు. బీజేపీతో పొత్తు ఉండటంతో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తెచ్చుకోవడానికి వీలుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సీనియర్ నేతల సలహాలను తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ప్రేమ, అభిమానంతో సీనియర్ నేతలకు తాను దగ్గరయ్యానని, ఇంత మందిని ఒకే వేదికపైకి తెచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి వచ్చే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఆపార్టీకి ఎందుకు ఓటు వేయాలో ప్రశ్నించాలని ఏఎస్ మనోహర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని ఏదో చెప్పాలని, మద్యనిషేధం ఎందుకు చేయలేదో వారిని నిలదీయాలన్నారు మంచి విజన్ ఉన్న గురజాల జగన్మోహన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలరన్నారు. కాగా, చిత్తూరు ఎంపీ టికెట్ ఆశిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావును ఈ సభలో పరిచయం చేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, కోదండయాదవ్, గురజాల సందీప్, సుబ్బానాయుడు, వరుణ్‌కుమార్, గోళ్ల హేమాద్రి నాయుడు, సీఎం విజయ, అశోక్‌ఆనంద్ యాదవ్, వెంకటేష్ యాదవ్, వరలక్ష్మి, దుర్గాచౌదరి, దయారాం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే ప్రకటించాలి



ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలని కోరుతూ మంగళవారం చిత్తూరులోని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ ఎదుట సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశించినా, ఎస్‌బీఐ జాప్యం చేస్తూ గడువు పొడిగించాలంటూ పిటీషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు పిటీషన్‌ను కొట్టివేస్తూ సరైన చర్య చేపట్టిందని వివరించారు. ఎన్నికల బాండ్ల వివరాలు సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ప్రకటిస్తే ఏ పార్టీకి ఎవరెవరు విరాళాలు ఇచ్చారో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు ఎస్.నాగరాజ, వీసీ గోపీనాథ్, రమాదేవి తదితరులు బ్యాంకు చీఫ్ మేనేజర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. దాసరి చంద్ర, రఘు, రాజ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిలో బ్రహ్మ రథోత్సవం



మొగిలీశ్వరుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళ్యం, మార్చి 12: బంగారుపాళ్యం మండలం మొగిలిలో కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం బ్రహ్మ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్లకు అర్చకులు ప్రత్యేక పూజాభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి, బ్రహ్మరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు రథంపై మిరియాలు, బొరుగులు, పుష్పాలు చల్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు. రథదాత బెంగళూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ డెంటల్ విద్యాసంస్థల అధినేత నరసింహరాజు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అబ్బురపరచిన ప్రదర్శనలు

● 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' వీక్షణకు తరలివచ్చిన విద్యార్థులు



నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు

గంగవరం, మార్చి 12: గంగవరంలోని మదర్ థెరీసా కళాశాలలో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా రెండో రోజైన మంగళవారం వివిధ జిల్లాల విద్యార్థులు 296 నమూనాలను ప్రదర్శించారు. ఈ నమూనాలు వీక్షకులను అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనను చూసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు భారీ గా వచ్చారు. నమూనాల తయారీ విధానం, ప్రయోగాలను వీక్షించారు. పంటలకు ఎరువుల పిచికారి, నీటి ఆదా, వాతావరణ కాలుష్య నివారణ, చేతిపనిముట్లతో ఆహార పదార్థాల తయారీ, బోర్లలో నీటి శాతం, సైకిల్ చక్రాలతో మట్టిని వేరుచేయడం, సేద్యంలో డ్రోన్ల వినియోగం, పంటలకు తక్కువ పెట్టుబడి విధానం తదితర నమూనాలను ప్రదర్శించారు. డీఈవో దేవరాజు, ఏపీవో వెంకటరమణరెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మునెప్పమొదలి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, మార్చి 12: చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలో గొడ్డళ్లు, రంపాలతో చొరబడుతున్న ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ఐ మహేశ్వర నాయుడు టీమ్ భాకరాపేట అనంతపురం హైవేలోని ఓ ప్రైవేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొందరు వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, ఆరుగురిని పట్టుకున్నారు. వీరిని సత్యసాయి జిల్లాకు చెందిన ఆనేవాళ్ళ హరి (43), తిరుపతి రూరల్‌కు చెందిన మురుగయ్య (27), తమిళనాడు కళ్లకురిచ్చికి చెందిన వేల్ మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేషన్ (46)లుగా గుర్తించారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డ వారి నుంచి మూడు బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేయగా సీఐ శ్రీనివాసులు దర్యాప్తుచేస్తున్నారు.

వేడుకగా కొండచుట్టు

ఉత్సవర్ల వెంట భక్తజనం



● దేవతాగణాలకు ఆదిదంపతుల వీడ్కోలు ● కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం



అశ్వ,సింహవాహనాలపై ఆదిదంపతుల విహారం

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం ఋషి రాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కొండచుట్టు వేడుకగా జరిగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలకు, ఋషులకు ఆదిదంపతులు వీడ్కోలుతో కృతజ్ఞతలు తెలిపారు.ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి చప్పరాలపై గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం జయరామారావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగు గంగ, కైలాసగిరి, రాజీవ్ నగర్ కాలనీ, పనసకోనల మీదుగా గిరిప్రదక్షిణ సాగింది. రామాపురం రిజర్వాయరు ఎదురుగా ఉన్న అంజూరు మండపం వద్ద కాసేపు విశ్రాంతి కోసం కొలువుదీర్చి పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. అంజూరు మండపం నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం, భైరవ ఎస్టీకాలనీ, తుఫాన్ సెంటర్ మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు భక్తిపూర్వకంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రాత్రి ముక్కంటి ఆలయానికి తీసుకు



ఎదురుసేవ మండపంలో హారతి

వచ్చారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వవాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు.ఉభయదారులుగా ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, ఆయన కుటుంబం, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, విజయవాడ కనదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీపాద సేవకుల మొరాయింపుతో గిరి ప్రదక్షిణ ఆలస్యం

కైలాసగిరి ప్రదక్షిణ ఊరేగింపులో శ్రీపాద సేవకులు మొరాయించడంతో ఉత్సవం రెండు గంటలు ఆలస్యంగా సాగింది. సోమవారం రాత్రి పట్టణంలో ఒకరు చనిపోవడంతో మంగళవారం ఉదయం చతుర్మాడ వీధుల సంప్రోక్షణ ఆలస్యమైంది. దాంతో కొంత ఆలస్యంగా ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు బయలుదేరారు. శ్రీ పాద సేవకుల్లోని ముగ్గురు పట్టణంలోని తెట్టు వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని కైలాసగిరి ప్రదక్షిణకు ఒకే ద్విచక్ర వాహనంపై బయల్దేరారు.శీతలాంబ ఆలయం పక్కన ఉన్న తొట్టంబేడు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ట్రిపుల్ రైడింగ్, 7 మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడ్డారు.ఈ విషయం తెలిసి మా మనుషుల్నే పట్టుకుంటారా అంటూ గిరిప్రదక్షిణలో దేవుని మోస్తున్న శ్రీపాద సేవకులు కాసేపు మొరాయించారు. ఓ ఆలయ అధికారి, వైసీపీ నాయకుడు మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత 12 గంటలకు అంజూరు వారి మండపం వద్దకు చేరుకోవాల్సి ఉండగా 2 గంటల ఆలస్యంగా ఉత్సవర్లు అక్కడికి చేరుకున్నారు.మామూలుగా అంజూరు వారి మండపం వద్ద నుంచి శ్రీపాద సేవకులు ముందున్నవారు వెనక్కు... వెనుక వారు ముందుకు మారాల్సి ఉంటుంది. అయితే ముందున్న వారు వెనక్కు వెళ్లబోమనడంతో శ్రీపాద సేవకుల మధ్య మళ్ళీ వాగ్వాదం నడిచింది. దాంతో మళ్లీ అక్కడ కాసేపు ఆలస్యం చోటు చేసుకుంది.శుక బ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవ మండపం వద్దకు 5 గంటలకు రావాల్సిన స్వామి అమ్మవారు సాయంత్రం 7:30 గంటలకు చేరుకున్నారు.

నేడు వసంతోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల్లో బుధవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఉదయం పురవీధుల ఉత్సవం పూర్తయ్యాక ఉత్సవమూర్తులకు తిరుమంజన గోపురం సమీపంలోని వసంత మండపానికి తీసుకెళ్లి వసంతోత్సవాలను నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. రాత్రి మేరు పర్వత సింహాసనంపై స్వామివారు, కామధేనువుపై అమ్మవారు ఆసీనులై పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.

మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు

చెక్‌పాయింట్ ఎలా దాటాయ్?

అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపిన తాజా ఘటన

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పసిబిడ్డల పాల సీసాలు కూడా కొండపైకి అనుమతించరే... అలాంటిది మద్యం గ్లాసులు, ఎముకలున్న బస్సులు మాత్రం పదుల సంఖ్యలో కొండపైకి ఎలా చేరుకున్నాయి?.... వైసీపీ సిద్ధం సభకు వెళ్ళిన తిరుమల డిపో ఆర్టీసీ బస్సులు వైసీపీ టోపీలతో పాటు మద్యం గ్లాసులు, మాంసం తినగా మిగిలిన ఎముకలతో కొండపైకి చేరుకున్న ఉదంతం మీడియాలో చూసిన పలువురి నోట వినిపిస్తున్న ప్రశ్న ఇది. తిరుమల ఆర్టీసీ డిపో బస్సులైనంత మాత్రాన వాటికి అలిపిరి చెక్ పాయింట్‌లో మినహాయింపులేమీ వుండవు. ఇతర వాహనాలను తనిఖీ చేసిన రీతిలోనే సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశాకే కొండపైకి అనుమతించాల్సి వుంది. ఈ డిపో నుంచీ మొత్తం 40 బస్సులను సిద్ధం సభకు కేటాయించగా అవి తిరిగొచ్చాక ఒకదాన్ని కూడా అలిపిరిలో చెక్ చేయలేదని సమాచారం. పదుల సంఖ్యలో బస్సుల్లో వైసీపీ టోపీలు, మద్యం గ్లాసులు, ఖాళీ బిరియానీ ప్యాకెట్లు, బిరియానీ తినగా మిగిలిన ఎముకలు సీట్ల కింద పడి వున్నాయి. ఈ ఘటన అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.

తప్పిదం ఆర్టీసీపైకి నెట్టేసే యత్నం: తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో నిషేధిత, అవాంఛనీయ వస్తువులతో కొండపైకి చేరుకున్న వ్యవహారంలో తప్పిదాన్ని ఆర్టీసీ సిబ్బందిపైకి నెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ సభకు జనాన్ని తరలించే డ్యూటీ అయినా లేక కేటాయించిన రూటులో ప్రయాణీకులను తరలించే డ్యూటీ అయినా ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లు తమకు నిర్దేశించిన విధులు మాత్రమే నిర్వర్తిస్తారు. అంతేకానీ బస్సుల శుభ్రత వారి డ్యూటీ కాదు. బస్సు గ్యారేజీకి చేరాక అక్కడి సిబ్బంది బస్సులను శుభ్రపరుస్తారు. తిరుమలకు వెళ్ళే బస్సుల్లో నిషేధిత వస్తువులు లేకుండా చూడాల్సిన బాధ్యత డ్రైవరు, కండక్టర్లపై కూడా వుంది. అయితే ఆ విషయంలో ఆ బాధ్యత వారిమీద కన్నా అలిపిరి టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బందిపై ఎక్కువగా వుంటుంది. ఆర్టీసీ బస్సా లేక ప్రైవేటు వాహనాలా అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రతి వాహనం తనిఖీ చేసి పంపాల్సిన బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిది. ఆ విధుల్లో వారు ఘోరంగా విఫలమైనట్టు సోమవారం నాటి ఘటన తేటతెల్లం చేస్తోంది. టీటీడీ సెక్యూరిటీ విభాగం వైఫల్యాన్ని కప్పిపెట్టి ఆర్టీసీపరంగా విచారణకు ఆదేశించడం, ఆర్టీసీ డ్రైవర్లపై చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు దారి తీస్తోంది. వైసీపీ టోపీ, మద్యం గ్లాసులు, బిరియానీ ప్యాకెట్లు, ఎముకలు వంటి నిషేధిత వస్తువులే కానీ తిరుమల భద్రతకు ప్రమాదకరమేమీ కాదు. వాటివల్ల కొండ పవిత్రత దెబ్బతింటుందే కానీ ఎవరికీ ప్రమాదకరం



కాదు. ఇదే ఆర్టీసీ బస్సుల్లో పై వస్తువులు కాకుండా ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు వంటివి తరలించే వుంటే పరిస్థితి ఏమిటన్నది పలువురి ప్రశ్న. ఈ కోణంలో ఆలోచిస్తే అలిపిరి చెక్ పాయింట్ డొల్లతనం ఏమిటో జనానికి సులువుగా అర్థమవుతుంది.

చెక్ పాయింట్‌లో సామాన్య భక్తులకు చుక్కలు

అధికార ఆర్భాటం, పలుకుబడి కలిగిన వారి సంగతి పక్కన పెడితే సామాన్యులు అలిపిరి చెక్ పాయింట్ దాటాలంటూ దేవుడి కంటే ముందు చుక్కలు చూస్తారన్న సామెత వుంది. బస్సులు, జీపుల్లో కొండపైకి వెళ్ళే సాధారణ యాత్రికులు అలిపిరి టోల్ గేట్ చెక్ పాయింట్ వద్ద కనీసం నీళ్ల బాటిళ్లను తీసుకెళ్లే పరిస్థితి లేదు. కొండపైన టీటీడీ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించడంతో అలిపిరి చెక్ పాయింట్‌లో ప్లాస్టిక్ బాటిళ్లను అనుమతించడం లేదు. బస్సుల్లో, జీపుల్లో వెళ్ళే వారు తమకు చిన్న పిల్లలున్నారని, మధ్యలో దాహమైనా, ఆకలైనా ఇబ్బంది పడతామని కాళ్ళావేళ్ళా పడినా చెక్‌పాయింట్ సెక్యూరిటీ సిబ్బంది ససేమిరా అంటారని నీళ్ళ బాటిళ్ళు, పాల సీసాలను లాక్కుంటారని పెద్ద పేరుంది. కొంత మంది సామాన్య యాత్రికులు కొండపైన కాటేజీల్లో వేడి నీటితో స్నానం చేసేందుకు గీజర్లు వెంట తీసుకుపోవడం పరిపాటి. అలాంటివి కూడా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా అడ్డుకుంటుంటారు. జీపులు, కార్లు, బస్సుల్లో వచ్చే యాత్రికులు చెక్ పాయింట్‌లో ఖచ్చితంగా కిందకు దిగాల్సిందే. లగేజీ మొత్తం కిందకు దింపాల్సిందే. తమతో పాటు, లగేజీని కూడా సెక్యూరిటీ స్కాన్ చేయించుకున్నాకే చెక్ పాయింట్ దాటి తిరిగి వాహనాలు ఎక్కాల్సి వుంటుంది. యాత్రికులు దిగి లగేజీ కిందకు దింపేశాక ఖాళీ జీపులు, కార్లు, బస్సులను సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుంది. సీట్ల కింద, సీట్ల వెనుక కవర్లు, డ్యాష్ బోర్డు, బోనెట్ లోపల కూడా తనిఖీ చేయాలి. బస్సులైతే ఫస్ట్ ఎయిడ్ కిట్ మొదలుకుని బోనెట్ లోపల, బస్సు ముందూ వెనుకా నేమ్ బోర్డు బాక్సులు కూడా తనిఖీ చేయాలి. డ్రైవర్, కండక్టర్లను కూడా చెక్ చేయాల్సి వుంటుంది. జీపులు, కార్లు, కిందకు దిగిన సామాన్య యాత్రికులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది బస్సుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వుంటున్నారనే ఆరోపణలున్నాయి. దూర ప్రాంతాల నుంచీ యాత్రికులు జీపులు, కార్లు అద్దెకు తీసుకుని వస్తుంటారు. తిరుమల వచ్చే అద్దె వాహనాల డ్రైవర్లకు కొండపై నిబంధనలు తెలియదు. ఆ కారణంగా వాహనాల్లో ఇతర మతాలకు చెందిన చిన్నపాటి చిహ్నాలు, వస్తువులూ వున్నా తెలియక టోల్ గేట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆయా వస్తువులను, చిహ్నాలను తొలగించి కొండపైకి వాహనాలను అనుమతించాల్సిన చెక్ పాయింట్ సిబ్బంది దానికి బదులు వాహన డ్రైవర్‌ను గంటల కొద్దీ నిర్బంధించడం, ఉగ్రవాదులను విచారించే రీతిలో ప్రశ్నించడం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చెక్ పాయింట్‌లో కొన్ని వర్గాలకు మినహాయింపు

టీటీడీ ఉద్యోగులు, తిరుమల స్థానికులు చెక్ పాయింట్‌లో కిందకు దిగకుండా బస్సుల్లోనే కూర్చుని వుంటారన్న ఆరోపణలున్నాయి. వారిలో కొందరు కొండపైకి అక్రమంగా మద్యం, మాంసం వంటివి తీసుకెళ్లడం సర్వసాధారణమని సమాచారం. బస్సులోకి సెక్యూరిటీ సిబ్బంది ఎక్కి వీరిని ప్రశ్నిస్తే టీటీడీ ఉద్యోగులు తాము స్టాఫ్ అని ఐడీ కార్డులు చూపడం, తిరుమల స్థానికులు తాము లోకల్ అని చెప్పడంతోనే సిబ్బంది మారుమాటాడకుండా బస్సు దిగేస్తుంటారన్న విమర్శలున్నాయి. కొండపైకి మద్యం తీసుకెళ్ళే వారు అక్కడ రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని సమాచారం. అదే విధంగా కొండపై వ్యాపారులు, స్థానికుల్లో పలువురు సాయంత్రం తిరుపతికి వచ్చి మద్యం సేవించి రాత్రికి తిరిగి కొండకు వెళ్ళడానికి అలవాటు పడ్డారు. కొందరు రోజూ ఇలాచేస్తుండగా, మరికొందరు వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి వెళతుంటారు. ఇలాంటి వారు మద్యం సేవించి బస్సులు, జీపుల్లో వెళతున్నా అలిపిరి చెక్‌పాయింట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రోజూ రాత్రి 7-10 గంటల నడుమ ఇలాంటి వారు పెద్దసంఖ్యలో తిరుమల వెళతుంటారు. ఖరీదైన కార్లు, పలుకుబడి కలిగిన వారి వాహనాలను సెక్యూరిటీ సిబ్బంది కన్నెత్తి కూడా చూడరని, వచ్చిన వాహనాన్ని వచ్చినట్టే చెక్‌పాయింట్ దాటిస్తారన్న పేరుంది. సామాన్యుల విషయంలో పాల బాటిళ్ళు, నీళ్ళ బాటిళ్ళు కూడా అనుమతించని సిబ్బంది పలుకుబడి కలిగిన వారు హెయిర్ డ్రైయర్లు, ఐరన్ బాక్సులు వంటివి తీసుకెళతున్నా పట్టించుకోరన్న విమర్శలున్నాయి. తాజా ఘటనతోనైనా టీటీడీ యంత్రాంగం మేలుకొని అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరముంది. దీనికి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరముంది.

కొండ బస్సుల్లో నిషేధాల తరలింపుపై విచారణ!

తిరుపతి అర్బన్, మార్చి 12: వైసీపీ సిద్ధం సభకు జనాన్ని తీసుకెళ్లిన బస్సులు నిషేధితపదార్థాలతో తిరుమలకు చేరిన సంఘటనపై ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తిరుమల పవిత్రత దెబ్బతినేలా వ్యవహరించారంటూ డిపో మేనేజర్‌స్థాయి అధికారితో విచారణచేపట్టి నివేదిక ఇవ్వాలనికోరారు. సభ నుంచి తిరుగుముఖం పట్టిన సమయంలోనే డ్రైవర్లకు తిరుపతిలోనే బస్సులను శుభ్రం చేసి కొండకు తీసుకురావాలని ఫోన్ ద్వారా తిరుమల డిపో మేనేజర్ సూచించారు.అయినా పట్టించుకోకుండా బస్సులను తిరుమలకు తెచ్చిన డ్రైవర్లను సమగ్రంగా విచారించనున్నారు.ఈ ఘటనతో తిరుమల ఘాట్‌లో నడిచే సప్తగిరి బస్సులను ఇకపై ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల ప్రయాణాలకు మినహా ఇతర కార్యక్రమాలకు, ప్రధానంగా రాజకీయ ప్రచారాలకు ఉపయోగించకూడదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,802 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,695 మంది తలనీలాలు సమర్పించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

LOST

I, Nagineni Poojitha D/o Nagineni Lakshumaiah, R/o: 1/72, Valhaluru, Pullampeta, Annamayya Dt, A.P., I have lost my Original Passport No. J6328515 Issued On Hyderabad On 25/07/2011 while she was travelling in an auto from Vathaluru To Pullampeta, I Lost My Original Passport. If anyone found please inform at the above address.

AJT - 6178

CHANGE OF NAME

I, Leelavathi (Old Name) R/o 3-8-284, Kummara Mitta, Tirupati Town And District, A.P. have change to my name to LEELADEVI

AJT - 6179

PLOT FOR SALE

తిరుపతికి దగ్గరగా తుడా ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ తక్కువ ధరకే అందుబాటులో కలవు. సంప్రదించండి. సంప్ర. : 82470 75857, 94943 92069.

AJT - 6176

CHANGE OF NAME

I, Upati Dilip Kumar (Old Name), R/o: 1-16-1, Puderu, Naidupeta, Tirupati Dt, A.p. Do Here By Declared I Have Changed My Name As Vupati Dileep Kumar (New Name) S/o Upati Venkatakrishnaiah.

AJT - 6180

ప్లాట్స్ ఫర్ సేల్

450ఎకరాల తిరుమల తిరుపతి దేవస్థాన ఉద్యోగుల ఇళ్ళస్థలాల పక్కన అయోధ్య టౌన్‌షిప్ నందు తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ ఫోన్:Ph.:95027 74175 / 79959 92114

AJT-6173

డ్రైవర్ కావలెను

బొలెర గూడ్స్ వెహికల్‌కు డ్రైవర్ కావలెను సెల్ నెం.: వి.రమణ 94411 04444 అడ్రస్: గంగా గణపతి స్టీల్స్ అండ్ సిమెంట్ అన్నమయ్య మార్గ్, గెస్ట్ లైన్ టూ డి.బి.ఆర్. రోడ్, నియర్ ఫిష్ మార్ట్, తిరుపతి.

AJT - 6172

DISTANCE EDUCATION

One Sitting / Regular 10th, Inter, NIOS APOSS Degree, PG, SVU, Nagarjuna University Guidelines for B.Tech failed Students NICC TPT: 93925 78108 / 91827 54522

AJT - 179918

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 176971

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

క్యాన్సర్ బాధితులకు ఎమ్మెల్సీ కంచర్ల సాయం



కుప్పం, మార్చి 12: క్యాన్సర్ బాధితులకు టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆర్థిక సాయం చేశారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని తంబిగానిపల్లెకు చెందిన సత్తి, నందిని దపతులకు జన్మించిన కవల పిల్లలు ప్రవీణ్ (4), పవన్ (4) చాలాకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కంచర్ల మంగళవారం వారి ఇంటికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులను కలుసుకున్నారు. చిన్నారులను పరామర్శించారు. వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చిన్నారుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వార్డు కౌన్సిలర్, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి

పెద్దపంజాణి, మార్చి 12: చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్‌నాయుడుకు సమాచారం అందింది. స్థానిక పెద్దపంజాణి కార్యాలయంలో ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్య క్రమంలో బీజేపీ నాయకులు నక్కా రామచంద్రయ్య, వెంకట్రమణ, ఎల్లారెడ్డి, వెంకట్రమణ తదితరులు ఉన్నారు.

ఎన్‌జీసీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

కల్లూరు, మార్చి 12: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్, హరిత పాఠశాల 2023-24 సంవత్సరంలో ఉత్తమ సేవలందించిన విద్యార్థులకు మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఎన్‌జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ గ్రీన్‌కోర్, హరిత పాఠశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి కార్యక్రమాల్లో ఎన్‌జీసీ విద్యా ర్థులు చురుకైన పాత్ర పోషించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భాస్కర్, నంద కుమార్, లోకేష్ తదితర విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహ్మత్‌బాషా, పూల రాజేంద్ర, లలిత, రేణుకాదేవి, గురవయ్య, అంజనేయులు, పాల్గొన్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె, మార్చి 12 : మండలంలోని శెట్టిపల్లె గ్రామంలోవున్న బాటగంగమ్మ ఆలయ వార్షి కోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం చేసి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలి నైవేద్యంగా సమర్పించారు. పలువురు దీపారాధనలతో మొక్కులు చెల్లించుకున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించండి

బైరెడ్డిపల్లె, మార్చి 12: మండలంలోని గ్రామాల్లో పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళ వారం పౌష్టికాహార పక్షోత్సవాలపై అంగన్వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ వరకు జరిగే పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత, సూపర్‌వైజర్లు లత, రమాదేవి, సుజాత, రాధ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

గంగవరం, మార్చి12: ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని గుండుగల్లు గ్రామంలో జరిగింది. బాధితుల కథనం మేరకు... గుండుగల్లు గ్రామానికి చెందిన అల్లాబక్ష కుటుంబసభ్యులు వ్యవసాయం, పాడి పోషణతో జీవనం సాగించేవారు. మంగళ వారం మధ్యాహ్నం పొలం వద్ద నుంచి భోజనం కోసం ఇంటికి చేరుకున్నారు. కొద్దిసేపటికే ఉన్నట్లుండి దట్టమైన పొగలు వ్యాపించడంతో అనుమానం వచ్చి బయట చూడగా గడ్డివామి మంటల్లో కాలిపోతోంది. స్థానికులు బకెట్లతో నీళ్లుపోసినా మంటలు అదుపులోకి రాలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే కొయ్యలు, గడ్డి కాలిపోయింది. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. కాగా ఎవరైనా బీడీ, సిగరెట్ తాగి పడేశారా లేక ఏదైనా కారణమో తెలియడం లేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి12: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని పూజగానిపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అన్నమయ్య జిల్లా ఆరోగ్యవరం సమీపంలోని ఉప్పరపల్లెకు చెందిన నవన్‌కుమార్ (32) ఇటుకల కోసం పుంగనూరు మండలం పూజగా నిపల్లె వద్దకు ట్రాక్టర్‌లో వెళుతుండగా మదనపల్లె వైపు నుంచి పలమనేరుకు వెళుతున్న ఒక పాల డైయిరీ వాహనం వెనక నుంచి ఢీకొంది. ట్రాక్టర్ నడుపు తన్న నవీన్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. పాల వాహనంలో డ్రైవర్ అజయ్‌కుమార్, గౌతమ్, రామచంద్ర ఉండగా వీరిలో గౌతమ్ కాలు విరిగిం ది. స్థానికుల సహాయంతో గౌతమ్‌ను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం కోలార్ మెడికల్ కాలేజీకి త రలించారు.

ఉపాధి, అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి

పుంగనూరు, మార్చి12: ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు అభివృద్ధికి పాటుపడే టీడీపీకి యువత ఓటు వేయాలని టీడీపీ మైనార్టీ యువనేత సుహేల్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తొలిసారిగా ఓటు వేస్తున్న యువతీ యువకులు రాష్ట్ర భవిష్యత్‌ను గుర్తించు కోవాల్సి ఉందన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి



ర్యాలీ చేస్తున్న మహిళా సంఘసభ్యులు

పుంగనూరు రూరల్, మార్చి 12: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండా లని పట్టణ మెప్మా సంఘం సభ్యులు పేర్కొ న్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యా లయం నుంచి ప్రైవేటు బ స్టాండ్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పట్టణ పీవో ముదుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ. కార్యక్రమంలో సీవోలు, ఆర్పీలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం



బైరెడ్డిపల్లె, మార్చి 12 : మండలంలోని చీలంపల్లె గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఓ మామిడి తోపులో అకస్మాత్తుగా మం టలు చెలరేగి పలు మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 300 మామిడిచెట్లు పూర్తిగా కాలిపోయినట్లు బాధిత రైతులు వాపోయారు.

పలమనేరు పురపాలక సంఘం, పలమనేరు

ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 35/2024/ఎ1 తేది: 12-03-2024

పలమనేరు పురపాలక సంఘ కార్యాలయము నందు మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా పనిచేయుటకు Bar Association మెంబర్ల నుండి దరఖాస్తులు కోరడమైనది. సదరు దరఖాస్తు తేది 13-03-2024 నుండి 21-03-2024 సా॥ 4.00 గంటల లోపల కమీషనరు, పురపాలక సంఘము వారికి సీల్డ్ కవరు నందు దాఖలు పరచవలెను. తదుపరి వివరముల కొరకు కార్యాలయ పనివేళల యందు సంప్రదించగలరు.

సం/- కమిషనరు, పలమనేరు పురపాలక సంఘము

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుప్పం, మార్చి 12: మండలంలోని కృష్ణదాసనపల్లె పంచాయతీ యానాదిపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త సెల్వరాజ్ అనారోగ్య కార ణాలతో మృతిచెందారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్. మునిరత్నం మంగళవారం గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళుల ర్పించారు. చంద్రబాబు తరఫున మృతుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

కుప్పం, మార్చి 12: డిస్ట్రిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్ఈవో) సుబ్బరాజు సోమవారం కుప్పంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా సారా, కల్లు, మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా మేస్త్రీ జన్మదిన వేడుకలు



మేస్త్రీ వెంకటరమణతో కేక్ కట్ చేయిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్లు

పలమనేరు, మార్చి12: పలమనేరు మున్సిపాలిటీలో పని చేసే శానిటరీ మేస్త్రీ వెంకట రమణ జన్మదిన వేడుకలను మంగళవారం మున్సిపల్ మీటింగ్ హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు గ్రామ పంచాయితీ స్థాయి నుంచి దశాబ్దాల పాటు పనిచేసిన వెంకటరమణ ఈ నెలాఖరును ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆలోగా ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఆయన పుట్టినరోజును మున్సిపల్ మీటింగ్ హాలులో నిర్వహించారు. మేస్త్రీ వెంకటరమణను మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, కమిషనర్ రమణారెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు శాలువలు కప్పి సన్మానించారు. ఆయనతో కేక్ కట్ చేయించారు.

శ్రీవారి సేవకు బొలెరో వాహనం



పలమనే రు, మార్చి12 : తిరుమల శ్రీవారి సేవలకు వినియోగించుకొనేందుకు పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి అభ్యర్థన మేరకు పట్టణానికి చెందిన జైసింగ్ బృందం బొలెరో వాహనాన్ని మంగళవారం అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు పూజలు చేసి అనంతరం వాహనాన్ని ఆలయ ఈఓ ధర్మారెడ్డికి అందజేశారు. ఈ వాహనాన్ని తిరుపతిలోని గోశాల నుంచి తిరుమల శ్రీవారి అభిషేకానికి అవసరమయ్యే పాలను తీసుకెళ్లేందుకు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. రవీంద్రరెడ్డి, జైసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే బంగారు భవిష్యత్తు



శివరామపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

శాంతిపురం, మార్చి 12 : చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే బిడ్డలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, ఇతర నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని శివరామపురం పంచా యతీ పరిధిలోని కోటగడ్డ, ఒడ్డువంక, కొత్తఇండ్లు, శాంతంపల్లె, గట్టూరు, శివరామపురం గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను మహిళలకు అందించారు. ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక పాఠశాల, రక్షిత నీటి ట్యాంకు, ప్రతి వీధికీ ఎల్‌ఈడీ లైట్లు, ఇలా ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించిన ఘనత చంద్రబాబుదేనని గుర్తుచేశారు. వైసీపీ వచ్చాక అభివృద్ధి ఆగిపోయిందన్నారు. చదువుకున్న వారు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. మళ్లీ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చంద్రబాబును ముఖ్య మంత్రిని చేసుకోవాలన్నారు. లక్ష ఓట్ల మెజారిటీతో బాబును గెలిపించుకోవాల న్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ ఉదయకుమార్, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, మణి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, బసవరాజు, రాజేంద్ర, సుబ్రమణ్యం, రవి, శివకుమార్, నాగరాజు, మురళి, గోపాల్, గోవిందరాజులు, జనసేన నాయకులు కిషోర్, ధను, తెలుగు మహిళలు శ్యామల, రూప, సరిత, పొలారాణి, హేమావతి, శైలజ పాల్గొన్నారు.

కుప్పం రైల్వే స్టేషన్‌లో గిరిజన, చేతివృత్తి ఉత్పత్తుల విక్రయకేంద్రం

● శంకుస్థాపన చేసిన ఎమ్మెల్సీలు



శంకుస్థాపన ఫలకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు

కుప్పం, మార్చి 12: కుప్పం రైల్వే స్టేషన్‌లో గిరిజన అటవీ ఉత్పత్తులు, చేతివృత్తి కళాకారుల విక్రయ కేంద్రానికి వైసీపీ ఎమ్మెల్సీ భరత్, టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రధాని నరేంద్రమోదీ 'వన్ స్టేషన్ - వన్ ప్రోడక్ట్' కార్యక్రమానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు స్థానికంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో కుప్పం రైల్వే స్టేషన్‌ను చేర్చినందుకు మోదీకి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఆ కార్యక్రమం కోసం రైల్వే స్టేషన్‌కు వచ్చినప్పుడు గుడుపల్లె రైల్వే స్టేషన్‌లో నెలకొన్న మరుగుదొడ్లు, తాగునీటి సమస్యల గురించి ప్రతిపక్ష నేత చంద్రబాబు తరఫున రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. దీనిపై స్పందిం చిన అధికారులు ఆయా సదుపాయాల కల్పనకు రూ.2.49 కోట్లు కేటాయించినట్లు తనకు తెలిపారన్నారు. చిన్నారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పా టు చేసి బహుతులు ప్రదానం చేశారు. దీనితో పాటు వందేభరత్ ఎక్స్‌ప్రెస్ రైలులో కుప్పం నుంచి వందమంది ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. రైల్వే ఉన్నతాధి కారులతోపాటు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృతుల ఓట్లు తొలగించాలి : బీజేపీ



డీటీ హరికృష్ణకు వినతి చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, మార్చి12: పుంగనూరు నియోజకవర్గంలో మృతిచెందిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ హరికృ ష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు మండల పరిధిలో ఓటర్ జాబితాలో మృతుల ఓట్లు తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. బూత్ నెంబరు 61లో దాదాపు 21 మంది చనిపోయి సంవత్సరాలు జరుగుతున్నా ఇప్పటివరకు తొలగించలేదన్నారు. వరుస నంబర్లు 280 సుబ్బమ్మ, 304 అనిగిరప్ప, 306 మునివెంకటమ్మ, 310 శంకరమ్మ, 334 చిన్నపాప, 345 వెంకటేశ్, 382 మునివెంకటప్ప, 377 శ్రీనాథ్, 390 మునెప్ప, 405 నారప్ప, 411 పోలెప్పగారి వెంకటేశ్, 434 రిక్షా జయరాం, 445 జయమ్మ, 463 వెంకటలక్ష్మి, 464 పోలెప్ప వెంకటప్ప, 459 గుడిసింటి రామచంద్ర, 484 చిరంజీవి, 566 విజయకుమారి, 567ఎం. మునెప్ప, 631 మడివలి నారాయణ, 795 సిద్ధయ్యలు చనిపోయినా ఓటర్ల జాబితాలో ఇంకా పేర్లు ఉన్నాయని వివరించారు. వీరందరినీ తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, పెద్దమఠం బాబు, మల్లికారాణి, నానబాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలోనే అభివృద్ధి సాధ్యం





బగళనత్తం, రామకుప్పంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, మార్చి 12: టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని రామకుప్పం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజూనాయక్, పార్టీ రామ కుప్పం, బందార్లపల్లె పంచాయతీల అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథరెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు రామకుప్పం పట్టణంతో బాటు బగళనత్తం, వీర్నమలపెద్దతాండాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన చంద్రబాబుకు అందరూ అండగా నిలిచి, వచ్చే ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీ అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో నేతలు గౌడానాయక్, మునిరెడ్డి, టీవీ.రవి, బాల రాజు, సుబ్రీ, మోహన్ పాల్గొన్నారు.

వీర్నమల పెద్దతాండాలో దాహం..దాహం



చేతిపంపు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రామకుప్పం, మార్చి 12: రామకుప్పం మండల పరిధి లోని వీర్నమల పెద్దతాండాలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని నెలలుగా తాగునీరు అందక పాఠశాల ఆవరణలోని చేతిపంపు నుంచి నీరు తీసుకెళుతు న్నామన్నారు. అందులోనూ జలాలు అడుగంటడంతో అక్కడ వేచి ఉండి నీరు పట్టుకోవాల్సి వస్తోందన్నారు. అలాగే వ్యవసాయబోర్ల ను ఆశ్రయిస్తున్నామన్నారు. తాగునీటి సమస్యపై ప్రజాప్రతి నిధులకు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలి తం లేకపోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రా మంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై సర్పంచు మోహన్‌నాయక్‌ను వివరణ కోరగా తాగునీటి పథకం బోరులో జలాలు అడుగంటాయన్నారు. అలాగే చాలామంది డైరెక్టుగా కొళాయి కనెక్షన్లు తీసుకుని సంపుల్లోకి నీరు మళ్లిస్తుండడంతో ట్యాంకుకు నీరు చేరడం లేదన్నారు. దీనివల్ల సమస్య తలెత్తిందన్నారు. బుధవారం గ్రామంలో సంపులకు ఉన్నకొళాయిలను తొలగిస్తామన్నారు. గ్రామం నడిబొడ్డున ట్యాంకు ఏర్పాటు చేసి అందరికీ నీరందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా

పలమనేరు మున్సిపల్ మీట్‌లో ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు, మార్చి12 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంగళ వారం జరిగిన మున్సిపల్ అత్య వసర సమావేశంలో సభ్యులు ఆమోదించారు. మున్సి పల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరు అయిన రూ. 60 లక్షలతో బస్సుషెల్టర్లు, ఆర్వో ప్లాంట్లు, మురుగు నీటి కాలువలు, సీసీ రోడ్లు వేసేందుకు ఆమోదం తెలిపారు. 14, 15 ఆర్థిక సంవత్సరం నిధులు, సాధారణ పుర పాలక నిధుల కింద వివిధ పనులను పూర్తిచేసినా బిల్లులు కాకుంటే మళ్లీ బిల్లులు పెట్టాలని నిర్ణయించారు. ఏప్రిల్ నెలలో రూ.30లక్షల వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానించారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. దీనిపై కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ నీటి సరఫరా కోసం చర్యలు తీసుకున్నా మన్నారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలో మూడు బోర్లు వేసి మోటర్లు బిగించే కార్యక్రమం జరుగుతోందన్నారు. సుమారు రూ.50 లక్షల సాధారణ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కోసం బోర్లు వేయడం, పైపులైన్ల పొడిగింపు పనులు చేపట్టేందుకు సమావేశంలో ఆమోదించారు. ఈ సమా వేశంలో ఆర్వో రవిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి



కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు

పలమనేరు, మార్చి12 : పలమనేరు మున్సి పాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు గిరిధర గుప్తా, ఓబుల్ రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌండిన్య రిజర్వాయర్‌లో నీరు లేనందున పట్టణంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింద న్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని ప్రయివేటు ట్యాంకర్ల యజమా నులు నీటి ధరను పెంచేశారని తెలిపారు. ఫలితంగా సామాన్యులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అసలే వేసవి వచ్చేసిందని అధికారులు వెంటనే స్పందించి కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని కాలనీల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని విన్నవించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు



కుప్పంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

కుప్పం/శాంతిపురం/పుంగనూరు రూరల్/ బైరెడ్డిపల్లె, మార్చి 12: రానున్న ఎన్నికల నేపథ్యంలో డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం కుప్పంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రధాన నేతాజీ రోడ్డుతోపాటు పలు వీధుల్లో కవాతు చేశాయి. అదేవిధంగా శాంతిపురంలో బడుగు మాకులపల్లె నుంచి తుమ్మిశి దాకా కుప్పం -పలమనేరు జాతీయ రహదారిపై కేంద్ర బలగాలు కదం తొక్కాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు. ● పుంగనూరులో సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కేంద్రబలగాలు, పోలీసులు కవాతు నిర్వహించాయి. ● కేంద్ర పోలీసు బలగాలు బైరెడ్డిపల్లెలో కవాతు నిర్వహించాయి. గంగవరం సీఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన రహదారిలో కవాతు సాగింది. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లె ఏఎస్ఐ వెంకయ్య, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

సోమల, మార్చి 12: వేసవిలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని ఎంఈవో శ్రీరాములు సూచించారు. మంగళవారం వడ్డిపల్లె పాఠశాలలో విద్యార్థుల ప్రగతి నివేదికలు పరిశీలించి వెనుక బడ్డ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే బావుల వద్దకు ఈతకు వెళ్లరాదన్నారు. కాగా ఎంఈవో- 2 శివరత్న అడుసుపల్లె, నంజంపేట, సరస్వతీ పురం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశాల నిర్వహించి పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం సుబ్రమణ్యం, సీఆర్పీలు పాల్గొన్నారు.

సోమల ఎంపీడీవోగా నారాయణ

సోమల, మార్చి 12: సోమల ఎంపీడీవోగా నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌లు ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న వరప్రసాద్ వెదురుకుప్పానికి బదిలీ అయ్యారు.

దుర్గం కొండ కనుమలో మంటలు

సోమల, మార్చి 12: పేటూరు పంచాయతీ బోనమంద సమీప దుర్గం కొండలోని కనుమలో గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు పొలాల వైపు మళ్లాయి. మంటలు మామిడి తోటల్లోకి వ్యాపించ కుండా ఆర్పేసేందుకు రైతులు అవస్థలు పడ్డారు. అటవీ శాఖకు చెందిన వెదురు బీట్‌లో మంటలు వ్యాపించాయి.

రొంపిచెర్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ సుకుమార్

రొంపిచెర్ల, మార్చి 12: రొంపిచెర్ల ఎస్ఐగా సుకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈయన పుంగనూరు నుంచి బదిలీపై రొంపిచెర్లకు రాగా ఇక్కడ పనిచేస్తున్న క్రిష్ణయ్య బైరెడ్డిపల్లెకు వెళ్లారు.

వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా రమేష్



నియామకపత్రం అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 12: టీడీపీ పుంగనూరు నియోజకవర్గ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా సోమల మండలం పెద్దఉప్పరపల్లె వడ్డిపల్లెకు చెందిన రమేష్ నియమితులయ్యారు. మంగళవారం రొంపి చెర్లలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆయనకు నియా మక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీడీపీ విజయం కోసం కృషిచేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సోమల మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ ఎంపీటీసీ పోతబోలు శ్రీనివాసులు, నాయకులు బంగారప్ప, వెంకటేష్, రఫీ, సురేష్, సుదర్శన్, బాలాజీనాయుడు, నాగరాజ, కోటేశ్వరనాయుడు, చంద్ర పాల్గొన్నారు.

పశుబీమా తప్పనిసరిగా చేయించాలి

రొంపిచెర్ల, మార్చి 12: పశువులకు రైతులు తప్పని సరిగా బీమా చేయించాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులునాయుడు సూచించారు. మంగళవారం ఆయన గానుగచింత, మోటమల్లెల, బొమ్మయ్యగారిపల్లె, బండకిందపల్లె, రొంపిచెర్ల పంచా యతీలోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మందులను పరిశీలించారు. డాక్టరు శ్రీధర్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చౌడేపల్లె, మార్చి12: మండలంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఈ చెక్కుల పంపిణీ చేపట్టారు. బైప్పల్లెకు చెందిన దీక్షిత్‌కు రూ.50వేలు, లద్దిగంకు చెందిన నాగరత్నమ్మకు రూ.60వేలు, చౌడేపల్లెకు చెందిన స్వీటీకి రూ.30వేలు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దామోదర్‌రాజు, మంత్రి పీఏ తుకారాం, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, నాయకులు అంజిబాబు, రుక్మిణమ్మ, సుబ్రహ్మణ్యంరాజు, మంజునాథ్, బాబు పాల్గొన్నారు.

రెండు ఓట్లూ సైకిల్‌కే వేయాలి: థామస్



తయ్యూరులో గజమాలతో థామస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం, మార్చి 12: జరగబోవు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఓట్లనూ సైకిల్ గుర్తుపైనే వేసి గెలిపించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పురం మండలం తయ్యూరు గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో థామస్, జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్నతో సహా రెండు పార్టీల శ్రేణులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు డాక్టర్ థామస్‌కు కర్పూర మంగళ హారతులతో స్వాగతం పలికారు. గజమాలలు వేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు నిధి, పూజారి నాగరాజు, దశరథ, వెంకటరమణ, లోకేశ్, సిద్ధయ్యశెట్టి, ఎస్.కుమార్, నిరంజన్‌రెడ్డి, హేమాద్రియాదవ్, గుండయ్య, బీగాల రమేశ్, బాలాజీ నాయుడు, దాము, తిరుమల, జనసేన నాయకులు రాఘవ, నరేశ్, సురేశ్‌రెడ్డి, అన్నామలై, మురళీ పాల్గొన్నారు.

ముఖ్యనేతలను కలసిన టీడీపీ నేత 'దగ్గుమళ్ల'

చిత్తూరు సిటీ, మార్చి 12: టీడీపీ నేత, మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు చిత్తూరులోని పలువురు సీనియర్ నేతలను కలిశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌తో కలసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సీకే బాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విజయపురం, మార్చి 12: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పన్నూరులో టీడీపీ, జనసేన సమన్వయంతో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు బెంజిమన్, పెరుమాళ్, బాబు, దొరైరాజ్, జాన్, పాండ్యన్, అమృతరాజ్, దొరైకన్, రవిచంద్రన్, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు, మార్చి 12: చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నగరపాలక కార్యాలయంలో జరిగింది. మేయర్ అముద, కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, శోభ, సహదేవన్‌లు పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. అజెండాలో భాగంగా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి వారి స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ ఆమోదించిన పనులను చేయడానికి, ప్రధాన కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్‌లో గుత్త వసూళ్ల కోసం నిర్వహించిన వేలం పాటలో హెచ్చుపాటదారుడికి కమిటీ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీవో ఎంఎస్ నెంబరు 36 ప్రకారం కేటగిరి వారీగా పెంచిన వేతనాలను చెల్లించడానికి, ఇతర అజెండాలోని అంశాలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తవణంపల్లె, మార్చి 12: మండలంలోని గురుకువారిపల్లె పంచాయతీ పరిధిలో రూ.3 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, పంచాయతీ భవనం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనం, బస్ షెల్టరును జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్పలు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తివేయాలి: ఆపస్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: సీపీఎస్ ఉద్యోగులపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా వాసి బాలాజీ మంగళవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. బాలాజీ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న ఉపాధ్యాయ, ఉద్యోగులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 10,500 మందికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని కోరారు.

కేసీపల్లిలో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, మార్చి 12: మండలంలోని కేసీపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 303 మందికి డాక్టర్లు వైద్యం అందించారు. అందులో 28 మందికి కళ్లజోడు ఉచితంగా అందించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

223వ రోజు అన్నదానం

గుడిపాల, మార్చి 12: గుడిపాల అన్న క్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం 223వ రోజు బెంగళూరుకు చెందిన లిక్విన్ డెవలపర్స్ యజమాని దేవరాజులు నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిట్టు, మురళీ నాయుడు, దొరబాబు, సుధాకర్ యాదవ్, ఆనంద్, ఆదికేశవులు, శంకర్ చౌదరి, శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతలపట్టులో...

పూతలపట్టు, మార్చి 12: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌లో మంగళవారం పంటపల్లి పంచాయతీ వెంకటరామాపురం గ్రామానికి చెందిన జి. వెంకటముని నాయుడు భోజనం వితరణ చేశాడు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండు నాటు తుపాకులు స్వాధీనం

- ఐదుగురు వేటగాళ్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న తుపాకులు, ఐదుగురు వేటగాళ్ల అరెస్టును చూపిస్తున్న డీఎస్పీ, పోలీసులు

కార్వేటినగరం, మార్చి 12: కార్వేటినగరం పోలీస్ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలం నక్కల దిన్నె ప్రాంతంలో రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని, ఐదుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నామని నగరి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం కార్వేటినగరం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు వెదురుకుప్పం మండలం నక్కలదిన్నె ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు నాటు తుపాకులు కలిగివున్న ఐదుగురు వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తనిఖీలో కార్వేటినగరం సీఐ సత్యబాబు, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

35లీటర్ల సారా స్వాధీనం

- వ్యక్తి పరారీ

గుడిపాల, మార్చి 12: మండలంలోని రాసనపల్లి పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ స్థావరంపై మంగళవారం గుడిపాల పోలీసులు దాడి చేశారు. వెస్ట్ సీఐ రవిశంకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించి, 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రామారావు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి మృతి



వినాయకం (ఫైల్ ఫొటో)

ఐరాల, మార్చి 12: కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఐరాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐరాల ఎస్ఐ రమేష్ కథనం మేరకు నాగమవాండ్లపల్లె పంచాయతీ వీఎన్.అగ్రహారానికి చెందిన వినాయక(45) కూలి పనులు చేస్తూ కుటుంబ పోషణ చూసుకుంటున్నాడు. ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇళ్లలో వెతికారు. మంగళవారం ఉదయం ఆయన కుమారుడు గుణశేఖర్ మేకలు మేపేందుకు నాగమవాండ్లపల్లె సమీపంలోని అటవీప్రాంతానికి వెళ్లాడు. గాలిగుండు వద్ద దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా, తండ్రి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో అతడు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. అనంతరం ఐరాల ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవ పంచనామా కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడి చెట్లు దగ్ధం



బంగారుపాళ్యం, మార్చి 12: గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అడవికి నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, కంచె పూర్తిగా కాలి బూడిదైన సంఘటన మండలంలోని నలగాంపల్లె పంచాయతీ మల్లేశ్వరగట్టు వద్ద చోటుచేసుకుంది. నలగాంపల్లె హరిజనవాడకు చెందిన చిన్నస్వామి 10 సంవత్సరాల క్రితం ఉపాధి హామి పథకంలో ఉన్న కొద్దిపాటి భూమిలో మామిడి చెట్లు పెట్టుకున్నారు. సుమారు 20 మామిడి చెట్లు పూత, పిందెలతో అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

పాలసముద్రం ఎస్ఐగా భారతి

పాలసముద్రం, మార్చి 12: పాలసముద్రం ఎస్ఐగా బి. భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చిత్తూరు ఎస్పీ నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బి. ప్రసాద్‌కు సీఐగా పదోన్నతి రావడంతో ఆయన బదిలీపై వెళ్లిపోయారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

- కలెక్టర్ షన్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: మహిళలు ఆర్థికాభివృద్ధి చెంది ఒకరికి డబ్బు ఇచ్చే వారిగా ఉండాలే కానీ, ఒకరి నుంచి డబ్బు తీసుకునే వారిగా ఉండరాదని కలెక్టర్ షన్మోహన్ ఆకాంక్షించారు. డీఆర్‌డీఏ పీడీ తులసి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని ఆ శాఖ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తమ స్వయం శక్తితో ఎదిగి సమాజంలో రాణించాలన్నారు. 20-25 మధ్య వయస్కులైన మహిళలు వ్యాపార రంగాన్ని ఎంపిక చేసుకుని పట్టుదలగా పనిచేస్తే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. పీడీ తులసి మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాలు లాభాల బాటలో సాగుతున్నాయని, బీఎంసీల ద్వారా రోజుకు రూ.2.75 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతుందన్నారు. ఎల్‌డీఎం హరీష్, ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీవాణి కిషోర్‌కుమార్, జిల్లా సబ్ రిజిస్ట్రార్ ఉషారాణి, దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, ఏపీఎంలు, వీఓలు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడమే ముఖ్యఉద్దేశం

- వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో స్టాల్ వద్ద బీజేపీ నేతలు, అధికారులు

చిత్తూరు రూరల్, మార్చి 12: స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడమే వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రధాని మోదీ అన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన రైల్వే స్టేషన్‌లలో వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో భాగంగా మంగళవారం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కో రాష్ట్రానికి ఒక్కో వస్తువు ప్రసిద్ధిగా ఉంటుందన్నారు. అలాంటి వస్తువులన్నిటిని ప్రధానంగా ఉన్న రైల్వేస్టేషన్‌లో ఒక్కో షాపు ఏర్పాటు చేసి అమ్మకం చేపట్టడం ద్వారా ఆయా రాష్ట్రాల సాంప్రదాయ చేతివృత్తులు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా దానిని తయారు చేసిన కళాకారుడు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రాష్ట్ర నలుమూల నుంచి ప్రసిద్ధిగాంచిన కొండపల్లి బొమ్మలు, టెర్రా కోటా వస్తువులు, కలంకారి ఇలా అనేక వస్తువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, బీజేపీ నేతలు జగదీశ్వర నాయుడు, చిట్టిబాబు, ఆర్పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



సన్మానాలందుకున్న మహిళా ఉపాధ్యాయులతో ఎస్టీయూ నేతలు

యాదమరి, మార్చి 12: మండల కేంద్రమైన యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రుక్మిణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మరింత రాణించడానికి కృషి చేయాల్సి ఉందన్నారు. ఎస్టీయూ నేత గంటా మోహన్ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులు చక్కగా రాణిస్తూ ఉత్తమ ఫలితాలను తీసుకొస్తున్నారని తెలిపారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించి, మెమెంటోలను అందించారు. ఎంఈఓ-2 ప్రసాద్, హెచ్ఎం లలిత, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పురుషోత్తం, జిల్లాశాఖ అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు లోహిత, ఉమ, లతా రమణి, రేవతి, అరుణ, ఉష, వాణి, భారతి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

చిత్తూరు రూరల్, మార్చి 12: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో 36 ప్రకారం రూ.21వేలు చొప్పున వేతనం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీయూ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి, కార్మికులకు రూ.21 వేల చొప్పున వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించారని చెప్పారు. ఇప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, వెంటనే హామీ ప్రకారం వేతనాల పెంపును అమలు చేయాలని, లేదంటే తిరిగి సమ్మెకు వెనకాడబోమని హెచ్చరించారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, వాసు, జయశంకర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి నరరూప రాక్షసుడు: థామస్

శ్రీరంగరాజపురం, మార్చి 12: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 70వేల మందిని ఇబ్బందులకు గురిచేసిన నరరూప రాక్షసుడు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అని టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ మండిపడ్డారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలం తయ్యూరులో టీడీపీ నేత, మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ పొన్న, ఎస్ఆర్‌పురం మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు పిల్లలు లేని 70వేల మందికి సంతానం కలిగిస్తే నారాయణస్వామి నియోజకవర్గంలో 70వేల మందిని హింసించి చిరస్థాయిగా రాక్షసుడుగా నిలిచిపోయారని విమర్శించారు. దళితులను హింసించిన దళిత ద్రోహి నారాయణస్వామి అని అన్నారు. నోరు అదుపులో పెట్టుకో.. చీటికి మాటికి మా నాయకుడు చంద్రబాబును విమర్శించినా, తిట్టినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. జనాలను మోసం చేసి కూతుర్ని ఎమ్మెల్యే చేయడానికి కొత్తరకం డ్రామా కంపెనీ పెట్టి.. సభల్లో ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. దమ్ము, ధైర్యంఉంటే నువ్వు, నీ కుమార్తె ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని కాణిపాకంలో సత్యప్రమాణానికి రావాలని థామస్ సవాల్ విసిరారు. ఏపీలో దుష్ట పాలనను అంతమొందించడానికి పవన్ కల్యాణ్, చంద్రబాబు, మోదీ పొత్తు పెట్టుకున్నారని యుగంధర్ పొన్న అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వైసీపీకి ఓటేయ్యవద్దని ప్రజలను అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని ఆయన కోరారు.

థామస్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: టీడీపీ

వెదురుకుప్పం, మార్చి 12: గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌పై వైసీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గుండయ్య హితవు పలికారు. మంగళవారం వెదురుకుప్పం టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి జిత్తులమారి నక్క అని, దళితులను మోసం చేసిన మోసకారి అని విమర్శించారు. వైసీపీ నాయకులు థామస్‌ను రాక్షసుడు అంటూ విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళీ పేర్కొన్నారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్, నాయకులు మొగిలయ్య, వరప్రసాద్, షణ్ముగం, మురగయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల విద్యార్థి ప్రతిభ



క్రీడాకారుడితో హెచ్ఎం, పీడీ

ఐరాలల, మార్చి 12: ఇటీవల బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారుడు వంశీకృష్ణ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని మంచి ప్రతిభను చూపినట్లు హెచ్ఎం కోమల, పీడీ దేవా తెలిపారు. వంశీకృష్ణ మంచి ప్రతిభను చూపి కాంస్య పతకాన్ని సాధించినట్లు వారు చెప్పారు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం క్రీడాకారుడిని, పీడీని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత పెన్షన్ ఇచ్చే వారికే మా ఓటు

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమణ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: పాత పెన్షన్ ఇచ్చే వారికే తమ ఓటు అని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తీర్మానించారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. మన భవిష్యత్తును నిర్ణయించేది మనం ఎంచుకున్న నేతలేనన్నారు. ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో పిలుపు ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, ఏపీటీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి చెంగల్రాయ మండడి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, హెచ్ఎం సంఘం అధ్యక్షుడు అరుణ్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుడిపాల ఏఎస్ఐగా రాజేంద్ర

గుడిపాల, మార్చి 12: గుడిపాల ఏఎస్ఐగా రాజేంద్ర మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఎస్ఐగా పని చేస్తున్న మునివేలు తవణంపల్లికి బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న రాజేంద్రను ఇక్కడికి బదిలీ చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ

గుడిపాల, మార్చి 12: మండలంలోని గట్రాళ్ళమిట్లలో మంగళవారం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ చేతులమీదుగా ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. చిత్తూరు టీడీపీ అభ్యర్థి జగన్మోహన్, జీజేఎం ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని ముస్లింలందరికీ రంజాన్ తోఫా అందించారు.

నష్టపరిహారం వచ్చినా... ఇవ్వరా...?



బాధితుడు వెంకటేష్ యాదవ్

గుడిపాల, మార్చి 12: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ ముత్తుకూరుపల్లిలో 2023వ సంవత్సరం ఆగస్టు 30వ తేదీన ఏనుగు దాడుల్లో వెంకటేష్ యాదవ్ అనే వ్యక్తికి సంబంధించిన దూడ మృతి చెందింది. దీనికి నష్టపరిహారం 2023 డిసెంబరు 23వ తేదీన డీడీ రూపంలో రూ.8 వేలు ఇవ్వాలని రేంజ్ ఆఫీసర్‌కు అటవీశాఖ అధికారులు సిఫార్సు చేశారు. అయితే ఈ విషయమై రేంజ్ ఆఫీసర్‌ను బాధితుడు అడుగగా ఈరోజు, రేపు అంటూ చెబుతూ... ప్రస్తుతం తమ వద్ద నిధులు లేవని, వేరే గ్రాంట్ వస్తే సర్దుబాటు చేసి ఇస్తామని సమాధానమిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



చిత్తూరులో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సీకేబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి సన్మానిస్తున్న పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్

వేసవిలో కోతలు లేకుండా చూసుకోండి

చిత్తూరు రూరల్, మార్చి 12: వేసవిలో కోతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సీజీఎం గురవయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం చిత్తూరు, వేపంజేరిలో ఆయన పర్యటించారు. అక్కడున్న సబ్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు మొదలయ్యాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలన్నారు. బిల్లులు వసూలు వంద శాతం ఉండాలని, బిల్లులు కట్టని ప్రైవేటు సర్వీసులకు సరఫరా నిలిపివేయాలని తెలిపారు. ఆయన వెంట ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

- మానవత్వం చాటిన ముస్లిం జేఏసీ సభ్యులు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

బంగారుపాళ్యం, మార్చి 12: మండల కేంద్రంలోని వినాయక మహల్ వద్ద గత కొంత కాలంగా రోడ్డు పక్కనే కాపురముంటూ మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ ఓ వృద్ధురాలు సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈమె అంత్యక్రియలను బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ సభ్యులు, తగ్గువారిపల్లె సర్పంచ్ వాణిప్రియ, పోలీసులు తగ్గువారిపల్లె శ్మశానవాటికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, ఏఎస్ఐ మల్లప్ప, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, జేఏసీ సభ్యులు అన్ను, సమీర్, గుణ, లోకేష్, లవ పాల్గొన్నారు.

శిలాఫలకం ఏర్పాటు కోసం డబ్బుల వసూలు

కార్వేటినగరం, మార్చి 12: మండలంలోని నాడు-నేడు పథకం ద్వారా పనులు చేపట్టిన పాఠశాలల్లో శిలాఫలకం ఏర్పాటు కోసం హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నుంచి డబ్బులు వసూలు చేయడం తగదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ ఖండించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా నిర్మించిన భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాల్సిన శిలాఫలకం కోసం ప్రతి స్కూల్ నుంచి రూ.7 వేలు చొప్పున హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా ఇవ్వాల్సిందిగా అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పనుల నాణ్యాతా ప్రమాణాలను ఉన్నతాధికారులు పరిశీలించాలని ఆయన కోరారు.

అధ్యాపకులు నిరంతర జ్ఞాన అన్వేషకులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: అధ్యాపకులు నిరంతర జ్ఞాన అన్వేషకులేనని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. జువాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ అధ్యాపకులకు సింగల్ మేజర్, మైనర్ అంశాలపై మంగళవారం కళాశాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జంతు శాస్త్రంలోని పలు అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సబ్జెక్టు లెక్చరర్లు వారి సబ్జెక్టుల్లో నిరంతరం అన్వేషణతో కూడిన అధ్యయనాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చిత్తూరు, పీలేరు, నగరి నోడల్ కళాశాలల అధ్యాపకులు, మాస్టర్ ట్రైనీలైన పలమనేరు జయశంకర్, వాయల్పాడు గురుమూర్తి, పీవీకేఎన్ చంద్రమౌళి, సమన్వయకర్త సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ సీసీగా మల్లీశ్వరి



బెస్ట్ సీసీ అవార్డు అందుకుంటున్న వెలుగు సీసీ మల్లీశ్వరి

గుడిపాల, మార్చి 12: రాష్ట్ర ఉత్తమ సీసీగా గుడిపాలకు చెందిన సీసీ మల్లీశ్వరి, డీఆర్డీఏ పీడీ తులసి చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నారు. ఈమె లోకోస్ అండ్ వీపీఆర్పీ డేటాలో బెస్ట్ సీసీగా అవార్డు అందుకున్నారు. ఏపీఎం సుధారాణి, వెలుగుసీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి అభినందించారు.

ఎన్‌టీఏ గౌరవ సలహాదారుడిగా వీరరాఘవుల నాయుడు



వీరరాఘవుల నాయుడిని సన్మానిస్తున్న ఎన్‌టీఏ సభ్యులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) గౌరవ సలహాదారుడిగా వీరరాఘవుల నాయుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేస్తూ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెడ్డి రమేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన్ను స్థానికంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు చేపట్టాలి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 12: పాఠశాలల్లో సామాజిక తనిఖీలు చేపట్టాలని విద్యాశాఖ సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం నుంచి పాఠశాలల్లో సామాజిక తనిఖీలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 15వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో తొలి రోజున 10 మండలాల్లోని ఎంఈవోలు, సిబ్బందికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా సోషియల్ ఆడిట్ చేయాలంటూ పలు అంశాలపై సూచనలు చేశారు. మార్గదర్శకాల ప్రకారం తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారిణి ఉదయలక్ష్మి, ఎనిమిది మంది రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనీలు, నాలుగు డివిజన్లలోని స్కూల్ హెడ్స్ శిక్షణ అందించారు.

లక్ష్మీ మహాగణపతి ఆలయ వార్షికోత్సవ పూజలు

విజయపురం, మార్చి 12: మండల కేంద్రమైన విజయపురంలో లక్ష్మీ మహాగణపతి ఆలయంలో మంగళవారం 41వ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతిహోమ అభిషేకం, హారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకులు వందవాసి మహేశ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థి చిత్తూరు, కొంగారెడ్డి పల్లి, నలంద నగర్, ఆఫీసర్స్ లేన్, డో.నెం. 2-1254లో యుండు అంస గణేష్, భర్త టి.గణేష్ గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని సదరు టి.గణేష్ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి జవ్వులు, దార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

SCHEDULE OF PROPERTY : Chittoor Dostrict- Chittoor Sub-District, gudipala Mandal, Chittoor Corporation Area No.190 Ramapuram Revenue Village, Dry Survey No. 215-1 Extent Ac 0.22 cents or 0.088 hectors, Dry Survey No. 215-2 Extent Ac 0.45 cents or 0.181 hectors, Dry Survey No. 215-3 Extent Ac 0.25 cents or 0.101 hectors, Dry Survey No. 215-4 Extent Ac 0.59.1/2 cents in this extent Ac 0.08 cents or 0.032 hectors, Dry Survey No. 223 Extent Ac 1.15 cents or 0.460 hectors As per 1B Revenue Records, Dry Survey No.215-1 Extent Ac0.22 cents in this Extent 0.12 cents or 0.048 hectors, Dry Survey No. 215-2A Extent Ac 0.45 cents in this Extent 0.17 cents or 0.068 hectors, Dry Survey No. 223-2 Extent Ac 1.15 cents in this Extent 0.21 cents or 0.084 hectors, Above 3 Sy Nos Total Extent Ac 0.50 cents or 0.200 hectors or 21775 sq.feet or 2419.44 sq.yards in this Plot No Plot Nos 39,40,41,42,43,44, 45,46,part Bounded by: East: Plot Nos 39 To 46 Part, West: Chittoor To Vellore Road & Sivalingam Land, North: Land of Rajendra Naidu, South: 30 Feet wide Road, In between East to West North site 30 feet or 9.00 meters South Side 54 feet or 16.20 meters, North to South East Side 98 feet or 29.40 meters West Side 99 feet admeasuring 4137 sq.ft or 459.1/2 sq.yards site full.

కె.ప్రవీణ్, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం. 10-115, గాంధీ రోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు సెల్ : 9550134756

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
లక్ష్మారంపల్లి శాఖ, తిరుపతి. ఫోన్: 9618610751

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు తెలియజేయడ మేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన ఋణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 26.03.2024 వ తేదీ లోపు బకాయిలు, ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:27.03.2024 సా.4.30** గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

క్ర. నెం.	ఖాతానెం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	బకాయి మొత్తం రూ.	బంగారు బరువు గ్రాములలో
1	32418390014876	కె.భారతి భర్త కె.ఎస్.విజయ్‌కుమార్, యల్లంపల్లి, వేపనపల్లి, తేనెపల్లె, చిత్తూరు	88105.21	21.30

తిరుపతి, తేది:12.03.2024 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్